క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



తెనాలిరూరల్: అప్పుల బాధతో బంగారు భరణాల తయారీ కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శనివారం రాత్రి తెనాలిలో చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన దామర్ల హరిరామకృష్ణ బంగారు ఆభరణాల తయారీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. పనులు లేక అప్పుల పాలైన అతను గతంలో ఐపీ దాఖలు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తుండడం, అప్పు ఏసుబాబు ఇంటి మీదకు వచ్చి అల్లరి చేస్తుండడంతో మనస్థాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు. బాధితుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్ అంధకారం

ఈగల్ టీమ్ డీఎస్పీ సింగయ్య



మంగళగిరి: డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే తమ లక్ష్యమని ఈగల్ టీమ్ డీఎస్పీ సింగయ్య తెలిపారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో స్కూలులో శనివారం డ్రగ్స్ వినియోగం వలన జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈగల్ టీమ్ డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో తమ జీవితాలను, భవిష్యత్తును పాడుచేసుకోవద్దని యువతకు సూచించారు. సరదాగా స్నేహితులతో కలిసి డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు. డ్రగ్స్ వినియోగం వలన ఆరోగ్యంతో పాటు జీవితం, భవిష్యత్తు సర్వస్వం కోల్పోతామనే విషయాన్ని యువత గ్రహించి భవిష్యత్తును కాపాడుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేయించారు. సీఐ రాంబాబు, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



దుగ్గిరాల: పొగాకు వ్యతిరేక దినోత్సవంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, నిమ్మగడ్డ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 37 మంది పాల్గొనగా ముగ్గురు విద్యార్థులు ఎం.వెంకటరావు (9వ తరగతి), డి.హర్షవర్ధన్ (9వ తరగతి), ఎస్.సాత్విక్ (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు రెహమాన్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు నోటి క్యాన్సర్‌కు కారకమవుతాయన్నారు. ఎంఈఓ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వ్యాస రచన పోటీల వల్ల విద్యార్థుల్లో పోటీ తత్వం పెరిగి, సృజనాత్మకత అలవడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ సమస్య పరిష్కరించాలి

రేపల్లె: బస్టాండ్ సెంటరులోని సులభ్ కాంప్లెక్స్ మురుగు నీరు సెప్టిక్ ట్యాంక్‌లోకి కాకుండా డ్రైనేజీ కాలువలో కలవటంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తుందన్నందున సమస్య పరిష్కరించాలని ఆటోడ్రైవర్‌లు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ రద్దీ ప్రాంతం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బస్టాండ్ నుంచి నెహ్రూ బొమ్మ సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు కె.గాంధీ, బి.నాగరాజు, విజయ్, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

భట్టిప్రోలు(వేమూరు): జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని బాపట్ల జిల్లా గృహ నిర్మాణ ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలోని ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా డబ్బులు చెల్లిస్తుందన్నారు. ఎస్టీలకు రూ. 70 వేలు, ఎస్సీలకు రూ.50 అదనంగా వస్తాయన్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. అందరూ ఇంటి నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరారు.

కొలకలూరులో అధ్వానంగా పారిశుధ్యం



రహదారి వెంట పేరుకుపోయిన చెత్త చెదారం



కాల్వ పారుదల లేక దుర్వాసన వెదజల్లుతున్న మురుగునీరు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. సంవత్సరాలు తరబడి గ్రామంలోని బీసీ కాలనీలో రోడ్లు, డ్రైయిన్లు లేక కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే మోకాళ్ళ లోతు నీళ్ళలో నడవలేక నానా అవస్థ పడుతున్నారు. తెనాలి మండలంలో 18 గ్రామాలు ఉండగా అతిపెద్ద జనాభా, ఓటర్లు ఉన్న గ్రామం కొలకలూరు.

అయితే గ్రామంలో అభివృద్ధి అంతంత మాత్రంగా ఉంది. ముఖ్యంగా బీసీ కాలనీలో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. కాలనీలో మొత్తం 8 రోడ్లు ఉన్నాయి. ఇవేవి అభివృద్ధికి నోచుకోక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. సిమెంట్‌రోడ్లు వేస్తామని, డ్రైయిన్లు నిర్మిస్తామని పాలకులు మాటలకే పరిమితమవుతున్నారు. గత కొన్నేళ్లుగా రోడ్లు వేయమని, కాల్వలు నిర్మించమని పంచాయతీ కార్యాలయంలో కాలనీవాసులు అనేకమార్లు అర్జీలు పెట్టిన ఫలితం కనబడటం లేదు. మురుగు కాల్వలు లేక ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు రోడ్డుపై పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. కొన్నిచోట్ల కాల్వల నుంచి పురుగులు బయటపడి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది కనీసం ఆ ప్రాంతంలో శానిటేషన్ చర్యలు చేపట్టకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది

కాలనీలో రోడ్లు, మురుగు కాల్వలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టిన తీర్మానాలకే పరిమితం చేస్తున్నారు తప్ప అభివృద్ధి ఆచరణకు నోచుకోవడం లేదు. వర్షాకాలం సమీపించినందున అధికారులు స్పందించి ముందు కాల్వల నిర్మాణం చేయాలి. శానిటేషన్ మెరుగుపరచాలి.

–గమిడి మణికంత, స్థానికుడు

ప్రతిపాదనలు చేశాం

బీసీ కాలనీలో మూడు రోడ్లకు ప్రతిపాదనలు చేశాం. రాబోయే పంచాయతీ సమావేశంలో ఆమోదించి రహదారుల నిర్మాణం చేస్తాం. కాల్వల నిర్మాణం చేసి పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం.

–కరిముల్లా, పంచాయతీ కార్యదర్శి

తెనాలి పట్టణ సుందరీకరణకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



పనులను పరిశీలిస్తున్న రాధిక

తెనాలిఅర్బన్: పట్టణ సుందరీకరణకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని గంగానమ్మపేటలో శనివారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి లోని అన్ని వార్డుల్లో ప్రణాళికబద్ధంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో ఎక్కడా చెత్త సేకరణపై ఫిర్యాదులు రాకుండా చూస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గొడవర్తి శ్రీసాయి హరేరామ్, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

కొల్లిపర: మండల పరిధిలోని రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తెనాలి నుంచి కొల్లిపరకు వస్తున్న ఆర్టీసీ బస్సు దావులూరు అడ్డరోడ్డు కార్నర్లో ఆగి ఉన్న ట్రాక్టను ఢీ కొట్టింది. అయితే ట్రాక్టర్ గేరులో ఉండటంతో ఇంజన్ స్టార్ట్ అయి ఎదురుగా ఉన్న ఎక్సెల్ పై ఉన్న వ్యక్తిని ఢీకొని, అనంతరం రెండు ఆటోలను ఒక ఆటోలో ఉన్న వ్యక్తిని కూడా ఢీ కొట్టి కొంత దూరం ఆటోను దారి వెంట ఈడుచుకుంటూ వెళ్లి ఒక గోడకు గుద్దుకుని ఆగిపోయింది. స్థానికులు స్పందించి వెంటనే 108 కి కాల్‌చేసి గాయాలైన ఇద్దరు వ్యక్తులను తెనాలి వైద్య తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ పి.కోటేశ్వరరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని టీటీడీ యార్డు ముఠా కార్మికులను కలిసి కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ముఠా కార్మికులకు సంక్షేమ చట్టాలను చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పనివిధానం కోసం, కనీస వేతనాల సాధన కోసం, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ సమ్మె జరుగనుందని వివరించారు. ఈ సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు కె.శ్రీనివాసరావు, టి.వెంకటయ్య, సుబ్బారావు, శ్రీనివాసరావు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి

వరహాపురం (వేమూరు): రోడ్ల పక్కన ఉన్న చెత్తను వెంటనే తొలగించాలని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో శనివారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొడి చెత్త, తడి చెత్తను ప్రతి ఇంటికి వెళ్లి సేకరించాలని కార్మికులకు సూచించారు. మురుగు కాలువలు పూడిక తీయాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్, వేమూరు పంచాయతీ కార్యదర్శి భూపతి రెడ్డి, వరహాపురం కార్యదర్శి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండి అందజేత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలోని ఓ చిరువ్యాపారికి గివింగ్ బ్యాక్ టు సొసైటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సీతారామయ్య తోపుడు బండిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ఉండవల్లి సెంటర్‌లో చిరువ్యాపారం చేసుకుని జీవిస్తున్న కుక్కల దుర్గ అద్దెబండి తీసుకుని అద్దెలు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని తోపుడు బండిని అందజేశామని తెలిపారు.

మంగళగిరి టౌన్: చాలీచాలని సంపాదనతో అద్దెబండి భారంతో ఇబ్బందులు పడుతున్న చిరువ్యాపారులకు గివింగ్ బ్యాక్ టు సొసైటీ సహకారం అందించింది. మంగళగిరి నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన దామర్ల బాబూరావుకు గివింగ్ బ్యాక్ టు సొసైటీ సహకారంతో తోపుడు బండిని అందజేశారు. అద్దెబండి భారంతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న సొసైటీ సాయం చేయాలనే ఉద్దేశ్యంతో నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా ఈ తోపుడు బండిని బాబూరావుకు అందజేశారు.

గంజాయితో యువత నష్టపోతుంటే

ప్రభుత్వం చోద్యం చూస్తోంది

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్



మాట్లాడుతున్న విజయ్ కుమార్

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ మాఫియా వల్ల యువత నష్టపోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి రూరల్ మండలం ప్రాతూరులోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పరిస్థితులు కంచే చేను మేస్తోందన్న చందంగా ఉందని, పోలీస్ శాఖలోని కొన్ని కలుపుమొక్కల వల్ల డ్రగ్స్, గంజాయి మాఫియా విస్తరించి యువత జీవితాలను నాశనం చేస్తోందన్నారు. దీనికి నిదర్శనమే రాజమండ్రిలో ఇద్దరు పోలీస్ అధికారుల ఫోన్ సంభాషణ అని పేర్కొన్నారు. గంజాయి కేసుల్లో అమాయకులను ఇరికించి లెక్కలు చూపించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలియజేశారు. గంజాయి కేసుల్లో అమాయకులను బలిచేసి రూ.కోట్లు సంపాదనే ధ్యేయంగా స్కెచ్ వేసినట్లు తెలియజేశారు.

బొమ్మూరు సీఐ లక్ష్మణరెడ్డి, రాజానగరం సీఐ సుభాష్‌లమధ్య జరిగిన సంభాషణ సంచలనం రేపుతోందని తెలిపారు. ఒక వైపు రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం జరుగుతుంటే అమాయకులపై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే గంజాయి మత్తులో తెలుగుదేశం కార్యకర్తలు కొట్టుకున్న పరిస్థితి ఉందని విమర్శించారు. లిక్కర్ స్కామ్ అంటూ హడావిడి చేస్తున్న ప్రభుత్వం అంతకు మించిన స్థాయిలో గంజాయి వ్యాపారం జరుగుతుంటే ఏంచేస్తోందని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వంవెంటనే విచారణ చేపట్టాలని, జ్యుడీషియల్ ఎంక్వైరీ వేసి నిజనిజాలు తేల్చాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఈవెంట్లు, స్టేట్‌మెంట్లకే పరిమితం అవుతోంది తప్ప ప్రజా సమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. రెవెన్యూ ఇంటెలిజెన్స్ నార్కోటిక్ బ్యూరో గంజాయి స్మగ్లింగ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు నివేదిక ఇచ్చిందంటే రాష్ట్ర ప్రభుత్వం పరువుపోయినట్లు కాదా అని అన్నారు. సచివాలయ వ్యవస్థను పటిష్టంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

లోక్ అదాలత్‌లో ఇరుపక్షాలకు మేలు

అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు



మాట్లాడుతున్న న్యాయమూర్తులు

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు చెప్పారు. తెనాలి కొల్లపేటలోని కోర్టుల ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీ కాదగిన కేసులను పరిష్కరిస్తారని, దీని వలన కక్షిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. జూలై 5న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. 5వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. లోక్ అదాలత్‌లో రాజీ అయిన కేసును తిరిగి పై కోర్టులో సవాలు చేసే అవకాశం ఉండదని, అలానే రాజీ అయిన కేసులకు సంబంధించి కోర్టు ఫీజులను తిరిగి ఇస్తారని వివరించారు. 2020–2021లో వచ్చిన కోవిడ్ ప్యాండమిక్ కారణంగా ఎన్నో కేసులు పెండింగ్‌లో ఉండిపోయాయని, న్యాయమూర్తులకూ పనిభారం ఉందని న్యాయమూర్తులు తెలిపారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం. శ్రీధర్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) ఆకా పవన్ కుమార్, 1వ అదనపు సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) పి. వివేక్ వర్ధన్, 2వ అదనపు సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) పి.రాజశేఖర్, లీగల్ సర్వీసెస్ తెనాలి కమిటీ కార్యాలయం సూపరింటెండెంట్ మహబూబ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు 'మా-ఏపీ' సమాయత్తం

వ్యవస్థాపకులు దిలీప్ రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలిరూరల్: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ (మా-ఏపీ) సంస్థాగత ఎన్నికలను త్వరలో నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. పెదరావూరు ఫిల్మ్ స్టూడియోస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు, సినీ పరిశ్రమలోని 24 విభాగాలకు చెందిన కార్మికులు ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులన్నారు. నటీనటులతోపాటు సభ్యత్వం ఉన్న కెమెరామెన్ దగ్గర నుండి ప్రొడక్షన్ బాయ్ వరకు ఎవరైనాసరే ఏపదవికైనా పోటీ చేసే విధంగా నియమ నిబంధనలున్నాయని తెలిపారు.

కార్యనిర్వాహక కమిటీకి పోటీ చేసే వ్యక్తులు విధిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారై ఉండితీరాలన్నారు. ఇప్పటివరకు అధ్యక్షులుగా సీనియర్ నటి కవిత, ఉపాధ్యక్షులుగా నరసింహరాజు, కార్యదర్శిగా అన్నపూర్ణ తదితరులున్న కార్యనిర్వాహక కమిటీ పదవీకాలం దాటిపోయిందని దిలీప్‌రాజా వివరించారు. నూతన కమిటీకి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను తెల్లకాగితంపై తమ పేరు, చిరునామా, ఫోన్ నంబర్, కేటగిరి వివరాలను రాసి పాస్ పోర్ట్ ఫోటో జతపరుస్తు 'మా-ఏపీ' కార్యాలయం, ఆలపాటి నగర్, సుల్తానాబాద్, తెనాలి 522 201, గుంటూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ చిరునామాకు జూలై 31 లోగా పంపాలన్నారు. సమావేశంలో నటుడు మిలటరీ ప్రసాద్, విశ్వనాథ్ ఉయ్యూరు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబు



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

తెనాలిరూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు సూచించారు. సైబర్ నేరాలపై తెనాలి రైల్వే స్టేషన్ ప్రాంతంలో శనివారం రాత్రి స్థానికులతో మాట్లాడి అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మోసం చేసే విధానం, నేరాలకు పాల్పడేందుకు ఏ విధంగా మోసపూరిత ఫోన్ కాల్స్ ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు పంపుతారన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఏ బ్యాంకు, రుణ సంస్థలు ఫోన్ చేసి ఆధార్, పాన్, ఓటీపీలు వంటి వివరాలను అడగవని, అటువంటివి అడిగితే ఖచ్చితంగా సైబర్ నేరగాళ్లేనని గుర్తించాలన్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చే ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లలో ఉండే లింక్‌లను క్లిక్ చేయకూడదన్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద కేటుగాళ్లు మోసాలకు పాల్పడతారని, అపరిచిత వ్యక్తులను నగదు డ్రా చేయమని కోరవద్దని చెప్పారు. పోలీసు వేషధారణలో వీడియో కాల్ చేసి మీ పేరిట లేదా మీ పిల్లల పేరిట విదేశాల నుండి కొరియర్ వచ్చిందని, అందులో నిషేధిత మాదకద్రవ్యాలు ఉన్నాయంటూ ఎటూ కదలకూడదని ఆజ్ఞాపిస్తారని, అటువంటి సందర్భం ఎదురైతే కాల్‌ను వెంటనే కట్‌చేసి సమీపంలోని పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరిట జరుగుతున్న మోసాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

కీటకజనిత వ్యాధులపై అప్రమత్తత అవసరం

- జిల్లా మలేరియా అధికారి మురళీ సుబ్బారాయణం
- దుగ్గిరాలలో మలేరియా అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మురళీ సుబ్బారాయణం

దుగ్గిరాల: మలేరియా మాసోత్సవాలపై అవగాహన ర్యాలీ శనివారం దుగ్గిరాల బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా మలేరియా అధికారి మురళీ సుబ్బారాయణం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్ గున్యా తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. కీటక జనిత వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటి నిల్వ లేకుండా చేసినట్లయితే దోమలవ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రెహమాన్, వి.సుబ్బారావు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతోనే ఆరోగ్యం మెరుగు



డాక్టరు రవిశంకర్ జంధ్యాలను సన్మానిస్తున్న నిర్వాహకులు

బాపట్ల: ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో మధుమేహం, హృద్రోగంతో ప్రజలు ఎక్కువగా బాధపడుతున్నారని ప్రముఖ హృద్రోగ వైద్యులు డాక్టర్ రవిశంకర్ జంధ్యాల (అమెరికా) చెప్పారు. శనివారం పీఎస్‌కే నర్సింగ్ కళాశాలలో ఆరోగ్య అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవనశైలిని మార్చుకోవడం ద్వారా ఈ తరహా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. తగినంత వ్యాయామం, నిద్ర, మితాహారం, మానసిక ప్రశాంతతతో కూడిన జీవనమే మెరుగైన ఆరోగ్యాన్ని అందిస్తుందని వివరించారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల, పీఎస్‌కే నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపల్ డబ్ల్యూఏజీకే మూర్తి అధ్యక్షత వహించారు. విజయవాడ మాజీ మేయర్ జంధ్యాల శంకర్, కళాశాల కరస్పాండెంట్ పేరలి సునీల్ కుమార్, ఫోరం కార్యదర్శి డా.పి.సి. సాయిబాబు ప్రసంగించారు. మానం అప్పారావు, మద్దుల నరసింహారావు, బాజీ, పంగులూరి హరిప్రసాద్, కరణం రవీంద్ర, వంకాయలపాటి హరిబాబు, కేశవులు, తోట రామాంజనేయులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ రవిశంకర్‌ను నిర్వాహకులు సన్మానించారు.

డిపాజిటర్ల హక్కులు, రక్షణ చర్యలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎస్.కాళహస్తి

దుగ్గిరాల: పలు రకాల పథకాలు, డిపాజిటర్ల హక్కులు, రక్షణ చర్యలు గురించి, ఆర్బీఐ సహకారంతో సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ (ఆర్డిట్స్) ఆధ్వర్యంలో దుగ్గిరాల మండల కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎన్.కాళహస్తి ఆర్బీఐ నియమాలు, ప్రభుత్వ పథకాలు, వివిధ రకాల రుణాలు, సబ్సిడీపై రుణాలు, బ్యాంకు ఖాతాల నిర్వహణ వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. మరో రిసోర్స్ పర్సన్ ఆర్.ఎస్.శంకర రావు డిపాజిటర్ల హక్కులు, బ్యాకింగ్ మోసాలు, డిజిటల్ మోసాలు, కె.వై.సి. అవసరాలు, పొదుపు ప్రాముఖ్యత తదితరాలను వివరించారు. ఆర్డిట్స్ కార్యదర్శి యర్రు సాంబశివరావు మాట్లాడుతూ డిపాజిటర్లకు వారి హక్కులు, రక్షణ చర్యల గురించి గ్రామీణస్థాయిలో అవగాహన కల్పించడమే సదస్సు ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఆర్డిట్స్ రాష్ట్ర సమన్వయకర్త షేక్ హుస్సేన్, ఏపీఎం సురేష్, మహిళలు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన సదస్సు



అమర్తలూరు(వేమూరు): మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి కంత ఉమాకాంత్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మలేరియా మాసోత్సవాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల సమస్యల ఉండదని తెలిపారు. విద్యార్థులు మానవ హారం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు కనపర్తి నిరీక్షణరావు, ఉపాధ్యాయులు కాట్రగడ్డ శ్రీనివాసరావు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం విస్తరణాధికారి కొల్లి శ్రీనివాసరెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు పుట్టగుంట శ్రీనివాసరావు, డిప్యూటీ పారా మెడికల్ అధికారి బాబు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.